సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకుంటున్న ఖానాపూర్ వాసులు

మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్‌లో స్థానికుల నిరసనతో వెనుదిరిగిన అధికారులు

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి వచ్చారు. సర్వే బృందాలు పోలీసులతో కలిసి రాగా స్థానికులు వారిని అడ్డుకున్నారు. ఏండ్లు గా తాము ఇక్కడ నివాసం ఉంటున్నామని, ఎట్టి పరిస్థితుల్లో సర్వేను జరగనివ్వబోమని వారు స్పష్టం చేశారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్1: హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని, పేదల జోలికొస్తే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి హైదరాబాద్‌లో తొలుత ఎన్ కన్వెన్షన్ కూల్చివేయడంతో ప్రజల్లో మంచిపేరు వచ్చిందని తెలిపారు.